www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 16 సెప్టెంబరు 2023 5

పశ్చిమ గోదావరి



ఓటర్ల సంక్షిప్త సవరణకు శ్రద్ధ తీసుకోవాలి : కలెక్టర్

భీమవరం : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా తయారీకి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికలు, రెవెన్యూ అంశాలపై ఇఆర్‌ఒలు, తహశీల్దార్లతో కలెక్టరు సమీక్షించారు. రాజకీయ పార్టీల సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. పొలిటికల్ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు వారికి సమాధానం పూర్తి స్థాయిలో అందజేయాలన్నారు. భీమవరం బివిరాజు కళాశాలలో 16, 17 తేదీల్లో జరిగే పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇ-డిస్ట్రిక్ట్ మేనేజర్, ఇ-డివిజనల్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 16వ తేదీ శనివారం, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలను 17వ తేదీ భీమవరం బివి.రాజు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు.

మైలు కూలి, లస్కర్ల వ్యవస్థ

కనుమరుగు..!

అస్తవ్యస్తంగా గోదావరి డెల్టా కాలువలు

కలుషిత జలాలతో ప్రజలకు రోగాలు

కాల్వల పరిరక్షణకు నిఘా వ్యవస్థ తప్పనిసరంటున్న రైతులు

ప్రజాశక్తి – భీమవరం రూరల్

గోదావరి డెల్టాలో సాగునీటి కాలువల వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం మైలు కూలీలు, లస్కర్ల పోస్టులు ఖాళీ అవుతున్నా గత మూడు దశాబ్దాలుగా భర్తీ చేయకపోవడమే. ఫలితంగా కాలువల మీద పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

గోదావరి డెల్టాలో ఏ ప్రాంతంలో చూసినా పంట కాలువలన్నీ కలుషిత జలాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్క, తూడు, ఫ్యాక్టరీల వ్యర్థాలతో కలుషితమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా ప్రజలు తాగునీటి సంబంధమైన రోగాల బారిన పడుతున్నారు. నూటికి 80 శాతం రోగాలు నీటి వల్లే వస్తాయని వైద్య గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎంతో ప్రాధాన్యత కలిగిన గోదావరి డెల్టాలో సాగు, తాగునీటి కాలువల వ్యవస్థకు 150 సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. అయితే గత మూడు దశాబ్దాలుగా లస్కర్లు, మైలు కూలీల పోస్టులు ఖాళీ అవుతున్నా ఏఒక్కటీ భర్తీ చేయడం లేదు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో నీటిపారుదల వ్యవస్థ రూపురేఖలు మారిపోయింది. గతంలో మైలు కూలీలు తమకు కేటాయించిన ప్రాంతంలో సంచరిస్తూ ఎప్పటికప్పుడు కాలువల తీరును గమనించేవారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూ ఎవరైనా చెత్తాచెదారం వేస్తే అడ్డుకునేవారు. కాల్వ గట్లు అంచుల వెంబడి తూడు, గుర్రపుడెక్క, కర్రనాచు వంటివి పెరిగితే వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవారు. అదే విధంగా గట్లు పటిష్టపర్చడానికి నిద్రగన్నేరు చెట్లను విరివిగా పెంచేవారు. దీనివల్ల కాలవగట్లు పటిష్టంగా ఉండటమే కాకుండా చూడటానికి ఆహ్లాదకరంగా ఉండేది. నిద్రగన్నేరు చెట్లతోపాటు మామిడి తదితర ఫల సాయమిచ్చే చెట్లను కూడా పెంచేవారు. దీనివల్ల ఆ మార్గంలో ప్రయాణించే వారికి నీడ కూడా దొరికేది. ప్రస్తుత పాలకులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. పంట కాలువల నిర్వహణను గాలికొదిలేశారు. పంట కాల్వలకు ఆనుకుని ఏర్పాటైన పరిశ్రమల వ్యర్థాలను సైతం వీటిలోకి విడుదల చేయడంతో కాల్వ నీరు కలుషితమవుతోంది. దీనివల్ల పంటలు దెబ్బతినడంతోపాటు తాగునీటిగా ఉపయోగించిన ప్రాంతాల్లో జనం రోగాల పాలవుతున్నారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది.

రెండు దశాబ్దాల కాలంగా ఆక్వా సాగు జోరందుకోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షలకుపైగా ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. వీటి నుంచి కలుషిత నీటిని నేరుగా పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. రొయ్యల సాగుకు సంబంధించి ఉప్పు నీటిని సైతం కాల్వల్లోకి వదలడంతో నీటి వనరులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో కాలువల పరిరక్షణకు కచ్చితంగా మైలు కూలీలు, లస్కర్ల వ్యవస్థ తరహాలో కొత్త వ్యవస్థనైనా ఏర్పాటు చేసి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. తద్వారా ఎంతోకొంత కాల్వలను కాలుష్యం బారినుంచి రక్షించుకునే అవకాశం ఉంటుందని, అదే సమయంలో కాలుష్య కారకులపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.




లాకుల వద్ద పేరుకుపోయిన చెత్త, జంతు కళేబరాలు, గుర్రపు డెక్క

విశ్వేశ్వరయ్య సేవలు స్ఫూర్తిదాయకం

మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి ఎనలేని సేవలందించారని, నేటితరం ఇంజినీర్లు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశానికి ముందు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నిర్వహించిన ఇంజినీర్స్ డే వేడుకల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో చేస్తున్న ఉద్యోగంలో గర్వంగా భావించాలన్నారు. లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొద్దిమంది మాత్రమే ప్రభుత్వ సర్వీసుల్లో చేరగలిగారని, అందుకు గర్వించాలని అన్నారు. పాలనాధికారులు, ఇంజినీర్ల సమన్వయంతో పని చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర గణనీయమైందన్నారు. ఇంజినీర్స్ దినోత్సవం సందర్భంగా మిమ్మల్ని సన్మానించుకోవడం సంతోషించదగిన విషయ మన్నారు. ఇంజినీర్లు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ప్రయోజనం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల ఇంజినీర్లకు జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఇంజినీర్లను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, పక్కనే మంత్రి కొట్టు

ఉద్యోగుల గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి – భీమవరం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఉద్యోగుల గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగుల నుంచి 11 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలతో సతమతమైతే విధులు సరిగ్గా నిర్వహించలేరని, గ్రీవెన్స్ ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటే వారు మరింత స్వేచ్ఛగా పనిచేసి శాఖలకు మంచి పేరు తెస్తారని తెలిపారు. ఉద్యోగుల సర్వీసు, పెన్షన్, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రీయింబర్స్ మెంట్ సమస్యలపై అర్జీలను ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా ట్రెజరీ అధికారి ఎ.గణేష్, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఎఒ వైకెవి.అప్పారావు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యలు వింటున్న డిఆర్‌ఒ కృష్ణవేణి

భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

పట్టాల మంజూరుకు అవసరమైన గ్రామాల్లో భూసేకరణ పనులను వెంటనే చేపట్టాలని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక బలుసులమ్మ అమ్మవారి కళ్యాణ మండపంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణతో కలిసి నియోజవర్గస్థాయి సమీక్షా సమావేశం జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గృహ నిర్మాణాలు త్వరగా చేపట్టాలన్నారు. కోర్టు ఇబ్బందులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. మెట్ట ఉప్పరగూడెం ఎస్‌టి కాలనీ వాసులకు, కొండేపాడు ఎస్‌సి కాలనీ వాసులకు నూతన ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. అలాగే నూతనంగా ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 90 రోజుల కాలవ్యవధిలో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇంటి స్థలాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు పొజిషన్ చూపాలన్నారు. టిడ్కో గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అక్టోబర్ నాటికి పూర్తి స్థాయిలో అందజేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం సమీక్షా సమావేశాలు నిర్వహించి వివిధ శాఖల పరిధిలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించుకోవడం ద్వారా అభివృద్ధి పనులు సులువవుతాయన్నారు. తమ పరిధి దాటినవి జిల్లా దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కరించడంతో అభివృద్ధికి అంటకం లేకుండా ఉంటుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధించగలమన్నారు. ప్రాధాన్యతా భవనాలు, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్, జలవనరులు, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జలవనరులు, రహదారులు భవనాలు, విద్యుత్, రెవిన్యూ సాంఘిక సంక్షేమం, ఐసిడిఎస్ పశు సంవర్ధక శాఖలపై రహదారులు, భవనాల, పట్టణ ప్రణాళికా, విద్యుత్, రెవెన్యూ గ్రామీణ నీటిపారుదల శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై ఆమె ఆరా తీశారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల సొంత స్థలాల్లో నిర్మించుకున్న 1,022 గృహాలు, 90 రోజులు ప్రోగ్రామ్ నందు ఇచ్చిన 246 పట్టాలు మొత్తం 1,268 గృహాల మంజూరుకు ప్రతిపాదించారు. తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలాల్లో జగనన్న లేఅవుట్ వద్ద అంతర్గత రోడ్లు, మరమ్మతు పనులు మంజూరు చేయడం గురించి, పెంటపాడు మండలం కోరుమిల్లిలో నూతనంగా పట్టాలు ఇచ్చిన జగనన్న లేఅవుట్‌లో స్థలం మెరకు చేయడం తదితర పనుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, సిపిఒ కె.శ్రీనివాసరావు, డిఎస్‌పి, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎ.శామ్యూల్, జిల్లా వ్యవసాయ సలహా మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

21 నుంచి దళిత రక్షణ యాత్ర

ప్రజాశక్తి – భీమవరం

దళితుల సమస్యలే ఎజెండాగా ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర చేపడుతున్నట్లు కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు కె.క్రాంతిబాబు, జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో దళిత రక్షణ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు, సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం మనువాద, మతోన్మాద విధానాలను శరవేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. ఎన్నడూ లేనంతగా దళితులపై దాడులు విపరీతంగా పెంచిందన్నారు. కుల వివక్ష, అంటరానితనం, అసమానతలతో ప్రజల మధ్య చీలికలు తెస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో దళితులకు కనీస రక్షణ కరువైందన్నారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకూ అన్ని జిల్లాల్లో దళితులపై దాడులు మరింతగా పెరిగాయన్నారు. దళితుల సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేయడం దారుణమన్నారు. దళిత రక్షణ యాత్రకు జిల్లాలోని అభ్యుదయ వాదులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ సంస్థలు, మేధావులు, ప్రజలందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

చంద్రబాబు అరెస్టు దారుణం

కొనసాగుతున్న టిడిపి నేతల దీక్షలు



మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉరితాళ్లతో ప్రదర్శన చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి – మొగల్తూరు

టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబుపై రాజకీయ కక్షతో అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించడం దారుణమని టిడిపి నేతలు అన్నారు. ముత్యాలపల్లిలో శుక్రవారం ఆ పార్టీ నేతలు ఉరితాళ్లతో వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బందన నరసింహస్వామి, కొల్లాటి బాలకృష్ణ, దొంగ శ్రీను, నాగిడి రాంబాబు, కొల్లాటి మూలస్వామి, నాగేశ్వరరావు, పెంటయ్య, కోటేశ్వరరావు, విజయకుమార్, వాటాల శ్రీను పాల్గొన్నారు.

భీమవరం రూరల్: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శుక్రవారం స్థానికంగా టిడిపి భీమవరం మండల అధ్యక్షుడు రేవు వెంకన్న ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ దీక్షలను టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి ప్రారంభించి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమి ఖాయమని తెలిసి జగన్ చంద్రబాబును అక్రమ కేసులతో జైలుకు పంపారన్నారు. మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమితో వైసిపి ఘోరఓటమి పాలవ్వడం ఖాయమన్నారు. దొంగపిండి సర్పంచి బొడ్డు రేవతిమోహన్, మాజీ ఎంపిపి బర్రె నెహ్రూ మాట్లాడగా వేండ్ర శ్రీనివాస్, గంటా త్రిమూర్తులు, కోళ్ల నాగబాబు, మాదాసు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలో అంబేద్కర్ సెంటర్ వద్ద కళ్లకు నల్ల గుడ్డలు కట్టుకుని టిడిపి నేతలు రిలేదీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మండల అధ్యక్షులు వాతాడ ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, కొల్లు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండి: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పాలకోడేరు మండల నాయకులు కూర్చున్నారు. వీరికి జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు ఆధ్వర్యంలో జనసైనికులు మద్దతు పలికి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, జనసేనాని జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును రిమాండ్‌కు తరలించడంలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కరిమెరక నాగరాజు, దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, జనసేన నేతలు గవరలక్ష్మి అనిల్, యడవిల్లి వెంకటేశ్వరరావు, ఎరుబండి రామాంజనేయులు, గాదం నానాజీ, తోట వాసు పాల్గొన్నారు.

ఆచంట: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆచంటలో టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, నేతలు కేతా మీరయ్య, గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామ్మూర్తి, నెక్కంటి ప్రభాకర్, కేతా మురళి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక గొర్రెల శ్రీధర్ కాంప్లెక్స్ వద్ద టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం మూడో రోజు కొనసాగాయి. ఈ దీక్షలకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో వర్తనపల్లి కాశీ, రామిశెట్టి సురేష్, పుల్లా బాబి, అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుతూ మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం మసీదులో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ సొర సాహెబ్, ఎమ్‌డి సాదిక్, షేక్ సాయి, షేక్ శోభన్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారం మూడో రోజు కొనసాగాయి. అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామానికి చెందిన జనసైనికులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచి మణికంఠ, సాయి హరీష్ కుమార్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో నిరాహార దీక్షలో కూర్చున్న ఎంఎల్‌ఎ రామరాజు

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నల్లబ్యాడ్జీలతో అగ్రిగోల్డ్ బాధితుల నిరసన

ప్రజాశక్తి – భీమవరం రూరల్

అగ్రిగోల్డ్ బాధితులు విజయవాడలో చేపట్టిన శంఖారావం దీక్షలను అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో భగ్నం చేయడం దారుణమని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం ఎల్‌ఐసి ఆఫీసు రోడ్డులో అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ అగ్రి బాధితులను అడుగడుగునా అరెస్టులు చేయడం దారుణమని, వారిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావును, ఇతర నాయకులను నిర్బంధించడం దారుణమన్నారు. ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కోనాల విమర్శించారు. మరో ఆరు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. అగ్రి బాధితులు తొమ్మిదేళ్లుగా న్యాయం కోసం చూస్తున్నారని, అగ్రిగోల్డ్ యాజమాన్యం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధితుందరికీ వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన బాధితుల కుటుంబ సభ్యులకు పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి పాలకుల మెడలు వంచుతామని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, పట్టణ గౌరవాధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, నాయకులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

యూనియన్ బ్యాంకు విలీనం ఒప్పకోం

నత్తారామేశ్వరంలో రైతులు, ఖాతాదారులు, మహిళల నిరసన

ప్రజాశక్తి – పెనుమంట్ర

నత్తారామేశ్వరంలోని యూనియన్ బ్యాంకును పెనుమంట్ర యూనియన్ బ్యాంకులో విలీనం చేయడానికి తాము ఒప్పుకోమని నత్తారామేశ్వరం, మాముడూరు, పాళీ చుట్టుపక్కల రైతులు, ఖాతాదారులు, మహిళలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం నత్తా రామేశ్వరంలో యూనియన్ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులు, మహిళలు, రైతులు మాట్లాడుతూ నత్తారామేశ్వరంలో యూనియన్ బ్యాంకు ఉండడం వల్ల తమకు లావాదేవీలు చేసుకోవడం సులభంగా ఉన్నదన్నారు. అదే పెనుమంట్రలో అయితే గంటలు, రోజుల తరబడి సమయం కేటాయించాల్సి వస్తుందన్నారు. బ్యాంకు విలీనానికి తాము ఒప్పుకోబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి శేఖర్, వెలగల ధర్మారెడ్డి, తమనంపూడి అయ్యప్ప రెడ్డి, టివిఎస్ రెడ్డి, టి.దుర్గారెడ్డి, తాడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, ఖాతాదారులు, మహిళలు

నేడు కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - యలమంచిలి రూరల్

కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16వ తేదీ శనివారం రాజమహేంద్రవరంలో జరుగుతున్న కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, యలమంచిలి మండల అధ్యక్ష కార్యదర్శులు కుంచే రామచంద్రరావు, కొప్పిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని అబ్బిరాజుపాలెంలో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల హరేరామ్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన ఉదయం పది గంటలకు రాజమండ్రి గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ భవనం హాలులో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని మండలాల నుంచి కొబ్బరి రైతులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి కొబ్బరి ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం వల్లే కొబ్బరి రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. నాఫెడ్ ఆయిల్ పెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఆయిల్ పెడ్ కమిషనర్ ప్రకటించడం హర్షణీయమన్నారు. కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొబ్బరి రైతులు సిరినిడి రామారావు, గుబ్బల ఏడుకొండలు, బొరుసు పెద్దిరాజు, జవాది సత్యనారాయణ, ఆంజనేయులు, వలవల శేషావతారం పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు క్షీరపురి అన్నదాన సేవ సమాజం వారి ఆధ్వర్యంలో పుస్తకాలు, యూనిఫాం శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, ఇతర సౌకర్యాలు అందించడం అభినందనీయమన్నారు. టిటిడి పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలని ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మట్టి వినాయక విగ్రహాలనే వాడాలని బార్డోలి స్కూల్ విద్యార్థులు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి గంధం శ్రీదేవి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ వినాయక చవితి వేడుకల్లో మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మట్టి విగ్రహాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన పద్మప్రియ, సునీతలకు బహుమతులు అందించామని చెప్పారు. అనంతరం ర్యాలీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

కాళ్ల : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించాల్సిన అవసరం ఉందని కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు కోరారు. మండలంలోని కోపల్లె గ్రామంలో ఎస్ఎండిఆర్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మట్టి వినాయక ప్రతిమల తయారీ పోటీలు నిర్వహించారు. భీమవరం నుంచి ఐక్య నేషనల్ ఫౌండేషన్, ఉండి నుంచి విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సోలేషన్ బహుమతులు అందించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 30వ తేదీన నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరావు అన్నారు. ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు పర్యవేక్షణలో ఆచంటలో శుక్రవారం ఇంటిం టికి వెళ్లి అవగాహన జగనన్న ఆరోగ్య సరక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సరోజినీవెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బందితో పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 18వ తేదీ నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు కనపాల పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆచంట తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి నాగరాజు, టిడిపి అనుబంధం సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

పాలకొల్లు : పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ దీక్షలకు ఎంఆర్‌పిఎస్‌కు సంబంధించిన అడ్వకేట్స్ వచ్చి మద్దతు తెలిపారు. రాపాక ప్రభాకరరావు, చదలవాడ సంపత్‌రావు సంఘీభావం తెలిపారు. జిల్లా ప్రచార కార్యదర్శి పసుపులేటి చిన్నిబాబు, కొండేటి వరదరాజు, పసుపులేటి రమేష్, కండవల్లి లీలాకృష్ణ, బాలన్ శివ, సనమండ పూర్ణశాస్త్రి, సనమండ విజయ, సుబ్బారావు, మాదాసు జయరావు, కాపువరపు జకరయ్య పాల్గొన్నారు.

'టిడిపి, జనసేన పొత్తులో ఆశ్చర్యమేమీ లేదు'

ప్రజాశక్తి - ఆచంట

తెలుగుదేశం, జనసేన పార్టీలు పొత్తుతో వెళ్తాయని పవన్‌కల్యాణ్ చెప్పడంలో ఆశ్చర్యమేమీ లేదని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో టిడిపికి పవన్‌కల్యాణ్ మద్దతు ఇచ్చారని, ఇప్పుడు కూడా కేవలం వైసిపిని ఓడించాలన్న ఆలోచనతోనే టిడిపి, జనసేన పొత్తు పెట్టుకుంటున్నాయన్నారు. ఈ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం రైతులందరికీ భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని జక్కరం గ్రామంలో రైతులకు భూ హక్కు పత్రాలను శుక్రవారం అందించారు. జక్కరం గ్రామానికి చెందిన 156 మంది రైతులకు భూహక్కు పత్రాలు, 25 మందికి కొత్తగా మంజూరైన పెన్షన్లు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాస్‌రాజు (వాసు), జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, ఉప సర్పంచి లక్ష్మీపతిరాజు, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, విఆర్‌ఒ జి.సుధాకర్ (బాబి), గ్రామ కార్యదర్శి ఎస్‌కె.జమాల్, రైతులు పాల్గొన్నారు.

సాగుదారులకు భూములపై హక్కు

మొగల్తూరు : సాగుదారులకు భూములపై ప్రభుత్వం హక్కు కల్పించనుందని సొసైటీ ఛైర్‌పర్సన్ మోటూపల్లి రామభాస్కరరావు తెలిపారు. మొగల్తూరులోని సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగల్తూరు మండలంలో సుమారు 12 వేల ఎకరాల సాగు చేస్తున్న ఎనిమిది వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు రేవు విజయలక్ష్మి, రాంబాబు, బొడ్డుపల్లి సుబ్బారావు, సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు ఉన్నారు.

'న్యాయమూర్తి హిమబిందుపై అసత్య ప్రచారం తగదు'

భీమవరం రూరల్ : చంద్రబాబు చేసిన అవినీతి అక్రమాలపై ఎసిబి కోర్టులో 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పిన జడ్జి హిమబిందుపై టిడిపి శ్రేణులు సోషల్ మీడియా ద్వారా కక్ష సాధింపు చేయడం తగదని గౌడ, శెట్టిబలిజ జిల్లా అధ్యక్షులు వేండ్ర వెంకటస్వామి అన్నారు. భీమవరంలో శుక్రవారం నిర్వహించిన బిసి సంఘాల సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్ష సాధింపులను గౌడ శెట్టిబలిజ సంఘం ద్వారా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

రహదారిపై గోతులు పూడ్చివేత

ఉండి : మండల కేంద్రమైన ఉండిలోని ఆర్‌ఒబి నిర్మాణంలో ఉన్న ప్రాంతంలో జాతీయ రహదారి మొత్తం గుంతల మయంగా ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని పలువురు ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జాతీయ రహదారుల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతం తమ పరిధిలోకి రాదని, ఆర్‌ఒబి నిర్మాణం ఉండటం వల్ల వారు రహదారి బాగు చేయాల్సిన పరిస్థితి ఉందని వారు తెలిపినట్లు ఎంఎల్‌ఎ చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆ ప్రాంతంలోకి వెళ్లి రహదారిలోని గుంతలను మెటల్ చిప్స్‌తో పూడ్చారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు


పాలకొల్లు : రామ్మోహన్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లయన్స్ క్లబ్ సారథ్యంలో లయన్స్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి డాక్టర్ బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్‌ను ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అరుణ, కార్యదర్శి మామం నారాయణరావు, కోశాధికారి డివివి.ప్రసాద్, పాటప్రత్ నాగధర్మవరప్రసాద్, ఎస్‌వివిఎస్.పాపారావునాయుడు సారథ్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాదిరెడ్డి బాబూశేఖర్‌రావు, డాక్టర్ ముచ్చర్ల సంజయ్ హాజరయ్యారు. లయన్స్ క్లబ్ ఇంజినీర్లు రేపాక నాగ శ్రీరామారావు, రవికుమార్, చినిమిల్లి నాగేంద్రప్రసాద్, మాటూరి రామ్‌కుమార్, ఎంటిఆర్ నాగార్జున, ఎస్‌హెచ్.జయంతి, శిడగం ఈశ్వర్, మామం విష్ణు, పాటప్రత్ దుర్గా శ్రీనివాస్, పాటప్రత్ నాగ సందీప్, రేపాక యశ్వంత్ రాజులను సత్కరించారు. జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య దేశంలోని ప్రముఖ కట్టడాలు నిర్మించారని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ బివిఆర్.శేషాద్రిని సత్కరించారు.

తణుకు : తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ జిల్లా డిప్యూటీ గవర్నర్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో స్వర్ణ క్లబ్ భవనంలో పురపాలక సంఘం ఇంజినీర్లు డిఇ కె.ఈశ్వర్‌రెడ్డి, ఎఇలు రామ్‌కిషోర్, శిరీషలను సన్మానించి జ్ఞాపికలు అందించారు. అనంతరం స్వర్ణ, మైత్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయకుడి మట్టి ప్రతిమలను అందించారు.

మొగల్తూరు : ముత్యాలపల్లిలో ఆరోగ్య వర్షిని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి విద్యార్థులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి నాగిడి రాంబాబు, గుడాల తాతారావు, బొక్క రాజేశ్వరి పాల్గొన్నారు.

పాలకోడేరు : నేటి యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ సూచించారు. పెన్నాడలోని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే సందర్భంగా అనేక టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహించారు. కాంపిటీషన్స్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

సర్ సివి.రామన్ పాఠశాలలో..

భారతదేశ ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శృంగవృక్షంలోని సర్ సివి.రామన్ పాఠశాలలో ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శిరీషాబాలకృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందాలంటే సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు అద్భుత కట్టడాలు భావితరాలకు ఉపయోగపడే రీతిలో నిర్మించాలని పలువురు ప్రముఖ ఇంజినీర్లు యువ ఇంజనీర్లకు సూచించారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ సివిల్ ఇంజినీరింగ్ స్టూడెంట్స్ విభాగం, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. రిటైర్డ్ ఆర్‌అండ్‌బి సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.సూర్యనారాయణరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.వెంకటకృష్ణ, ఎఇ ప్రసాద్‌రాజులను ఘనంగా సత్కరించారు.

ఆకివీడు : స్థానిక లయన్స్ క్లబ్ హాలులో ఆరుగురు ఇంజినీర్లకు సన్మానం చేశారు. లయన్స్ సీనియర్ నాయకులు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఇంజినీర్లు దేశ ప్రగతికి రూపశిల్పులని ఎపి నిట్ డీన్ అకాడమిక్ డాక్టర్ టి.కురుమయ్య సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థ ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద ఇంజినీర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కురుమయ్య హాజరయ్యారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లిగూడెం డైమండ్స్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో పలుచోట్ల ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు.

రైతులకు సేవలను చేరువ చేయాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎఎంసిల ద్వారా రైతులకు సేవలు చేరువ చేయాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నర సింహరాజు అన్నారు. ఎఎంసి నూతన కమిటీలో మండల ంలోని కోరుకొల్లు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయ కులు గుండు నాగేశ్వరరావుకు స్థానం కల్పించడంపై పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పెదఅమిరం పార్టీ కార్యాలయంలో పివిఎల్. నరసింహరాజును ఉండి ఎఎంసి డైరెక్టర్‌గా ఎంపికైన గుండు నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పివిఎల్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - ఆచంట

ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆచంట వేమవరం కర్ణోద్భవ కళ్యాణ మండపంలో నిర్వహించిన సిపిఎం ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల శిక్షణా తరగతులు శుక్రవారం రెండోరోజుతో ముగిశాయి. ఈ తరగతులకు మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్.శర్మ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కేతా గోపాలన్ పార్టీ నిర్మాణం శాఖల పని విధానం అంశాన్ని కార్యకర్తలకు పాఠ్యాంశంగా భోధించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల మూలంగా దేశంలో సరళీకరణ విధానాలు అమలు చేయడంతో స్వేచ్ఛ మార్కెట్ పేరుతో పెట్టుబడుదారులు, పాలక ప్రభుత్వాలు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పోడూరు, పెనుగొండ మండలాల కార్యదర్శులు పిల్లి ప్రసాద్, సూర్నీడి వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబు, గుత్తుల రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ, వెన్నపు ప్రసాద్, రాపాక సత్యనారాయణ, జిల్లెళ్ల కృష్ణమూర్తి, పిల్లి చంటిబాబు పాల్గొన్నారు.

వీరవాసరంలో మండల స్థాయి క్రీడా పోటీలు

వీరవాసరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వీరవాసరంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అండర్ -14, అండర్ - 17 విభాగంలో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు జరిగాయి. అండర్ - 14 బాలికల ఖోఖోలో కొణితివాడ, కబడ్డీలో, షార్టుపుట్, డిస్క్‌త్రో, లాంగ్‌జంప్‌లో వీరవాసరం జట్లు విజయం సాధించాయి. అండర్ -14 బాలుర విభాగంలో షార్ట్‌పుట్‌లో తోలేరు, డిస్క్‌త్రో తోలేరు, లాంగ్ జంపు వీరవాసరం, వాలీబాల్‌లో కొణితివాడ, కబడ్డీ, ఖోఖో వీరవాసరం, టెన్నికాయిట్ తోలేరు జట్లు విజయం సాధించాయి. అండర్ - 17 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, త్రో బాల్‌లో వీరవాసరం జట్లు విజయం సాధించాయి. అండర్ -17 బాలుర విభాగం అథ్లెటిక్స్, షార్ట్‌పుట్, డిస్క్‌త్రోలో తోలేరు, లాంగ్ జంప్, త్రిపుల్ జంప్‌లో వీరవాసరం జట్లు విజయం సాధించాయి. ఎస్‌జిఎఫ్ మండల స్థాయి గేమ్స్ అండర్-17 బాలుర విభాగంలో వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో వీరవాసరం, టెన్నికాయిట్‌లో తోలేరు జట్లు విజయం సాధించాయి. అథ్లెటిక్స్ అండర్ -17 విభాగంలో షార్టుపుట్, డిస్క్ త్రో, త్రిపుల్ జంప్‌లో తోలేరు విజయం సాధించగా, లాంగ్ జంప్‌లో వీరవాసరం విజయం సాధించింది. ఈ పోటీల్లో మండల విద్యాశాఖాధికారులు ఎస్.రాజేష్, ఎంఎన్ఎస్ .నారాయణ, ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాస్, మండల ఎస్‌జిఎఫ్ కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అత్యంత ప్రతిష్టాత్మకంగా రీ సర్వే : ఎంపిపి చంటిరాజు


పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి - పాలకోడేరు

వందేళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, అప్పటి నుంచి ఏ ప్రభుత్వం ఆ సర్వేపై దృష్టి పెట్టలేదని, వైసిపి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రీ సర్వే చేస్తుందని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. రీ సర్వే పూర్తయిన వేండ్ర, వేండ్ర అగ్రహారం గ్రామాల్లో భూ యజమానులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపిపి చంటిరాజు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. రీ సర్వే వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. భూములు సర్వే చేసి రాళ్లను కూడా ప్రభుత్వమే వేస్తుందని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. తహశీల్దార్ షేక్‌హుస్సేన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు, ఆర్‌ఐ నాగభూషణం నాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేండ్ర సర్పంచి కడలి నాగేశ్వరి వీరబాబు, ఉప సర్పంచి భూపతిరాజు సుబ్బరాజు, ఎంపిటిసి సభ్యులు పాల జ్యోతి, వైసిపి గ్రామ అధ్యక్షులు సానబోయిన వేణు, విఆర్‌ఒ అలేఖ్య , మల్లేశ్వరరావు, లెనిన్, సత్యనారాయణ, భూ యజమానులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అన్నారు. వేండ్ర అగ్రహారంలో నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందిస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. కుల, మత బేధాలు లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి విజయలక్ష్మి, వైసిపి నాయకులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, రాంబాబు, కుడిపూడి శ్రీను పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా సమాచారం అందించరా..?

ఆకివీడు మండల సమావేశంలో ఎంపిటిసి సభ్యులు హనుమ ఆవేదన

ప్రజాశక్తి - ఆకివీడు

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరైన విషయం కూడా తమకు తెలియజేయరా అంటూ గుమ్మలూరు ఎంపిటిసి సభ్యులు కోపెల హనుమ ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు మంజూరైనట్లు తమకు సమాచారం అందిందని, ఆ మేరకు వెంటనే సొంత సొమ్ములు చెల్లించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పటివరకు ఆ నిధులు తమ చేతికి అందలేదని గ్రామ సర్పంచి కోట అనంతలక్ష్మి చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి, ప్రజా సమస్యలు తీర్చడానికి ఉన్నామని, తమ బాధ్యతగా తాము ఆ పనులు చేశామని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కటారి జయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొన్ని ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు అజెండాగా చర్చ సాగింది. ఈ క్రమంలో గుమ్మలూరు గ్రామాభివృద్ధికి నిధుల మంజూరు అంశంపై సభలో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఒక దశలో జెడ్‌పిటిసి సభ్యులు వెంకటరాజు కలుగజేసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిడిఒ శ్రీవాణి మాట్లాడుతూ మండలంలో ప్రత్యేకించి ఆకివీడులో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇల్లు కట్టుకునేందుకు ఇష్టంలేనివారి వద్ద నుంచి, ఆ రకంగా పత్రం రాయించి తీసుకోవాలని ఇంజినీరింగ్ శాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎంపిటిసి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - వీరవాసరం

పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ టి.లక్ష్మీకాంతం అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వీరవాసరం శెట్టిబలిజపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు.

పోడూరు : మండలంలోని పెనుమదంలో జెడ్‌పి హైస్కూలులో పాలకొల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిపిడిఒ సిహెచ్.ఇందిర ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రదర్శనలు, పిల్లల బరువుల పర్యవేక్షణ, రక్తహీతన గర్భిణులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కిశోర బాలికలకు, బాలురకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు.

మొగల్తూరు : పోషకాహారం తీసుకుంటే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపిటిసి సభ్యులు ఉషారాణి అన్నారు. మండలంలోని కొండవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ప్రదర్శన చేశారు.

కాళ్ల : పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమలత అన్నారు. మండలంలోని మాలవానితిప్ప, ఎస్‌సి బోస్ మాజీ సైనిక్ కాలనీ, కాళ్లకూరు, ఏలూరుపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మహోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ఆకుకూరలు, పండ్ల మొక్కలను నాటారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు, పాలు పంపిణీ చేశారు.

ఉండి : ఉండి మండల వ్యాప్తంగా శుక్రవారం పోషణ మహా కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారులు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను తగ్గించవచ్చని సూచించారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ వాణి విజయరత్నం, సూపర్‌వైజర్లు వెంకట నాగలక్ష్మి, వి.నిర్మల, అంగన్‌వాడీలు గడి కుసుమ, ముదునూరి జాన్సీ, డి.సత్యవేణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

ఉండి : ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పాటించిన ఆహారాన్ని తీసుకోవాలని పకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌ఛార్జి మహేష్ అన్నారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో శుక్రవారం 18 రకాల బయో కల్చర్, కోడిగుడ్లు, నిమ్మరసం ద్రావణం కలిపి డ్రోన్ సహాయంతో 37 ఎకరాల్లో వరిపైరుపై పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి రైతు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి రమణమ్మ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపలు జూనియరు సివిలు జడ్జి వారి కోర్టులో

I.A. 703/2022 in O.S. 37/2016

Between:
చిటికిన సూర్యచంద్రరావు (died) As per LR's
చిటికిన పార్వతి మరియు అదర్స్
-పిటీషనరు/వాదులు
మరియు
వేముల కృష్ణమూర్తి & అదర్స్
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To:
శ్రీమతి అంగర వనరాజ్యలక్ష్మి, W/o. గోవిందు, C/o. & D/o. చిటికిన పార్వతి, డో.నెం. 8-104/2, గౌడ పేట, మోర్త గ్రామం, ఉండ్రాజవరం మండలం, TNK PJCJ.

పై నెంబరు గ్రంధములో మీకు శ్రీ కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపియున్నప్పటికి మీరు తీసుకోవటం లేదు అని శ్రీ పై కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా ది. 26-9-2023న ఉదయం గం|| 10.30 ని||లకు హాజరు కమ్మని ఆర్డరు వేసియున్నారు. మీరు **ది. 26-9-2023న ఉదయం గం|| 10.30 ని||లకు** మీరు స్వయంగా గాని, లేక ప్లీడరు ద్వారా గాని హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపర్చుకొనవలెను. లేనియెడల మీపై పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్పు చెప్పబడును.

P.PADMAVATHI
B.SRINIVASA PRASAD, Advocates
T.P.Gudem Tadepalligudem
15-9-2023 Pentapadu, Cell:9848499470

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి, భీమడోలు, ఏలూరు జిల్లా

O.S. 112/2021

Between:
శ్రీ సుంకర రామారావు **-వాది**
మరియు
శ్రీ గురువెల్లి ముఖలింగం మరియు వగైరాలు **-ప్రతివాదులు**

To:
ప్రతివాది నెం-3:
కుమారి గురువెల్లి రేణుక, తండ్రి: ముఖలింగం, హిందు, స్త్రీ, వయస్సు 21 సం||లు, డోర్ నెం. 2-44, రెడ్డినాయుడు పేట, పూళ్ళ గ్రామం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంధములో తమ కోర్టు వారు ఆర్డరు ప్రకారం ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రికా ముఖముగా ఆర్డరు వేసియున్నారు. కావున **తేది. 26-9-2023న** పై **కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని||లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట మీరు హాజరవ్వగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులననుసరించి ప్రకటన జారీ చేయటమైనది)

KURAPATI PRITHVI RAJ
Advocate, Eluru, Cell: 8019826216

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి, భీమడోలు, ఏలూరు జిల్లా

I.A. No. 251/2021 in O.S. 112/2021

Between:
శ్రీ సుంకర రామారావు **-పిటీషనరు**
మరియు
శ్రీ గురువెల్లి ముఖలింగం మరియు వగైరాలు **-రెస్పాండెంట్లు**

To:
రెస్పాండెంటు నెం-3:
కుమారి గురువెల్లి రేణుక, తండ్రి: ముఖలింగం, హిందు, స్త్రీ, వయస్సు 21 సం||లు, డోర్ నెం. 2-44, రెడ్డినాయుడు పేట, పూళ్ళ గ్రామం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంధములో తమ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రికా ముఖముగా ఆర్డరు వేసియున్నారు. కావున **తేది. 26-9-2023న** పై **కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని||లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట మీరు హాజరవ్వగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులననుసరించి ప్రకటన జారీ చేయటమైనది)

KURAPATI PRITHVI RAJ
Advocate, Eluru, Cell: 8019826216

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జంగారెడ్డిగూడెం

ఓ.ఎస్.నెం. 126/2022 మరియు ఐ.ఏ.నెం. 388/2023లో కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

మధ్య:
శ్రీమతి కాళింగి భద్రకాళి ...వాది
మరియు
శ్రీ ధరణికోట దుర్గా శంకర్ వగైరాలు ...ప్రతివాదులు

టు: ప్రతివాదులు: కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం:
1) శ్రీ ధరణికోట దుర్గా శంకర్, H/o. లేటు నెక్కింటి పుష్పవతి, హిందూ, పు||, వ||58 సం||లు, హైస్కూలు దగ్గర, ఆశ్వారావుపేట రోడ్డు, జంగారెడ్డిగూడెం (V&M), ఏలూరు జిల్లా.
2) శ్రీమతి వలసపల్లి అఖిల @ ధరణికోట అఖిల, భర్త: జగదీష్, స్త్రీ, వ|| 32 సం||లు, నాచారం గ్రామం, పోస్టు, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
3) శ్రీ ధరణికోట నిఖిల్, తండ్రి: దుర్గా శంకర్, పు||, వ||35 సం||లు, హైస్కూలు దగ్గర, ఆశ్వారావుపేట రోడ్డు, జంగారెడ్డిగూడెం (V&M), ఏలూరు జిల్లా.

ఈ నంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు దావా సమన్లును రిజిష్టరు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను, ఎన్నిమార్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకోకుండా Avoid చేయుచున్నందున తేది **27-09-2023 సమయం 10:30 ని||లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపు న్యాయవాది వారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

మోదేపల్లి నాగులు
జంగారెడ్డిగూడెం. అడ్వకేట్, జంగారెడ్డిగూడెం.
16-09-2023. సెల్: 96407 19598

ప్రకటన

నా క్లయింటు అయిన **శ్రీమతి కేశనపల్లి స్రవంతి, భర్త: మదన్‌మోహన్,** హౌస్ నెం. 23బి-5-21, ఫ్లాట్ నెం. 502, జగన్నాధ రెసిడెన్సీ, రామచంద్రరావుపేట, ఏలూరు వారు తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటు అయిన కేశనపల్లి స్రవంతి గారు ఈ దిగువ తెల్పిన షెడ్యూలు ఆస్తిని దొడ్డిగర్ల నాగేశ్వరరావు, తండ్రి: రాజారావు, ప్లాట్ నెం. జి/10, రామకృష్ణ అపార్టుమెంటు, సత్యసాయి రెసిడెన్సీ, ఏలూరు అను వారి దగ్గర కొనుటకు నిర్ణయించు కొనియున్నారు. సదరు నాగేశ్వరరావు దిగువ ఆస్తి తాలూకా లింకు డాక్యుమెంట్లు అనగా 1) డాక్యుమెంటు నెం. 2040/2008, 2) డాక్యుమెంటు నెం. 9715/2002 పోయినవి అని వాటిపై పోలీసు స్టేషనులో కంప్లైంటు, పేపరు ప్రకటన కూడా ఇచ్చినారని తెలిసి సదరు దిగువ ఆస్తిని నా క్లయింటు కొనుటకు నిర్ణయించుకొనినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎటువంటి క్రయ విక్రయాలు మరియు ఏవిధమైన లావాదేవీలు జరిగినట్లయితే నాకు స్వయంగా గాని, ఫోను ద్వారా గాని ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోపు తెలియజేయవలెను. లేని ఎడల నా క్లయింటు షెడ్యూలు ఆస్థి కొన్న దరిమిలా జరుగు ఎటువంటి లావాదేవీలకు బాధ్యులుకారు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, వట్లూరు సబ్-రిజిస్ట్రారు, పెదవేగి మండలం, దుగ్గిరాల గ్రామ పంచాయితీ, దుగ్గిరాల గ్రామములోని ఆర్.ఎస్.నెం. 420/3 దాఖలా య.1-63 సెంట్లులో చ||గ||122-0-0లు అనగా 104 చ||మీ|| ఖాళీ స్థలమునకు హద్దులు:
తూర్పు: బోడ దేవ సుందరం గారి గోడ 21-0 అ||లు. **దక్షిణం:** 16 అ||లు వెడల్పు రోడ్డు 50-0 అ||లు. **పడమర:** 16 అ||లు వెడల్పు గల రోడ్డు 23-0 అ||లు. **ఉత్తరం:** సదర్ల మాణిక్యమ్మ గారు ఇతరులకు విక్రయించిన స్థలం 50-0 అ||లు.

ఈ హద్దుల మధ్య చ||గ||122-0-0లు ఖాళీ స్థలం, ఈ స్థలమునకు పూర్వంనుంచి గల రాకపోకలు యావత్తు ఈజుమెంటు వగైరా హక్కులతో సహా.

శ్రీ అంబుల వెంకట నారాయణ
న్యాయవాది, అగ్రిగోల్డ్ అపార్టుమెంటు ప్రక్కన, పత్తేబాద, ఏలూరు. సెల్: 98484 22155

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

E.P. 15/2023 in O.S. 45/2021

మధ్య:
జల్ది నాగలక్ష్మి, W/o. వెంకటేశ్వరరావు, స్త్రీ, వయస్సు 52, గృహిణి, డోర్ నెం. 14-20-6/1, ఫ్లాట్ నెం. 101, 24వ వార్డు, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. ***...D.H.R.***

Vs

1. ఇంధన నాగేశ్వరరావు, S/o. అప్పారావు, పురుషుడు, వయస్సు 61 సం||లు, వ్యాపారం, డోర్ నెం. 13-4-15/4, గోటేటివారి వీధి, రామచంద్రరావుపేట, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
2. ఇంధన వెంకట సత్యవతి, W/o. నాగేశ్వరరావు, స్త్రీ, వయస్సు 57 సం||, గృహిణి, డోర్ నెం. 13-4-15/4, గోటేటివారి వీధి, రామచంద్రరావుపేట, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. ***...J.D.R***

D.H.R. తరపున చేసిన స్థిరాస్తి వేలము ప్రకటన

పై నంబరు E.P. లో O.S. 45/2021 డిక్రీ బాకీ రాబట్టుటకు పై కోర్టు వారు యిందలి షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారు ఎదుట **ది. 3-10-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు** వేలం నిర్వహించబడును. సదరు షెడ్యూలు ఆస్తి కొటక్ మహీంద్ర బ్యాంకు తాడేపల్లిగూడెం వార్కి రూ. 18,97,692/- తనఖా బాకీ ఉన్నది. సదరు తనఖా బాకీ లోబడే వేలం నిర్వహించబడును. కావున యావన్మంది వేలంలో పాల్గొని స్థిరాస్తిని పాడుకోవలయును అని తెలియజేయడమైనది.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్, 30వ వార్డు, మున్సిపల్ ఏరియా రామచంద్రారావుపేట, గొటేటివారి వీధి దగ్గర, డోర్ నెం. 13-4-29 పక్క అసెస్‌మెంటు నెం. 6/4లో 649 చ||గ||లో 701/2 చ||గ|| నైరుతి మూల డోర్ నెం. 13-4-29/1లో డూప్లెక్స్ బిల్డింగ్ తలుపులు ఎలక్ట్రికల్ సర్వీసు టాప్ కనెక్షన్ వగైరా ఈ క్రింది హద్దులు మధ్య.
తూర్పు: అ. 27.3 కాళ్ల వెంకటరత్నం స్థలం ప్రస్తుతం ఇమ్మంది జయ నాగ వెంకటలక్ష్మి బిల్డింగ్. **దక్షిణం:** అ. 56 మంచాల నాగమణి బిల్డింగ్ ప్రహరీ గోడ. **పడమర:** అ. 27.3 మున్సిపల్ రోడ్డు. **ఉత్తరం:** అ. 56.10 పందిళ్లపల్లి పద్మజ స్థలం బిల్డింగ్‌తో సహా.

పై హద్దుల మధ్య డూప్లెక్స్ బిల్డింగ్ గలదు. యావత్తు తలుపులు, ఎలక్ట్రికల్, టాప్ కనెక్షన్స్ మరియు యావత్తు ఈజుమెంటు హక్కులతో సహాయున్ను.

1. అమిన్ వాల్యూ: రూ. 50,00,000/-
2. డి. హెచ్.ఆర్. వాల్యూ: రూ. 25,00,000/-

శిరిగినీడి విజయకృష్ణ
అడ్వకేటు అండ్ నోటరీ
తాడేపల్లిగూడెం అడిషనల్ సి.పి., తాడేపల్లిగూడెం
13-09-2023 సెల్: 9440111251